# వడగళ్లు

[చిన్నకథ]

•

శ్రీ అడివి బాపిరాజు

వడగళ్లవాన కురిసి పంటంతా పాడైంది. అంతటితో పతంజలి కుంగిపోయాడు. ముదుసలితల్లి, పెళ్లికెదిగి వచ్చిన చెల్లెలు, చదువుకుంటూన్న తమ్ముడు. అయిదెకరాలమీదా సొంతవ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించా లనుకున్నాడు ఈవీడు. నూతి క్రింద వక ఎకరం వరి వూడ్చినాడు. తక్కిన నాలుగెకరాలూ జొన్న వేసినాడు. ఎం తవుతుందీ? ఏ మవుతుందీ? ఆ నూతిదగ్గరే వక చిన్న పంపులో పాదులు చేసి, తోటకూరా, పాలకూరా మొదలైన ఆకుకూరలూ ఓ సన్నజాజిపందిరా పెంచుతున్నాడు. ఏడాది జెయిలుకు వెళ్లివచ్చినాడు. జెయిలులో వున్నప్పుడే గ్రామస్థులు కొందరు సహాయంచేసి వ్యవసాయం సాగించారు. అతను పందొమ్మిదివందలనలుబది ఎనిమిదవ సంవత్సరం సెప్టెంబరులో విడుదలైనదగ్గరనుంచీ గ్రామస్థుల సహాయానికి కృతజ్ఞత చూపిస్తూ వారిని రక్షించమని భగవంతుణ్ణి ప్రార్థించుకొన్నాడు. పంట కోసే బంగారంవంటి పంటకాలం ముందర విత్రిగా ఈ వడగళ్లవాన చక్కా వచ్చింది. పతంజలిశాస్త్రి జీవితం మూలమంతా కదలిపోయింది. జీవితంలో ఏలాంటి కష్టాలనైనా చిరునవ్వుతో ఎదుర్కొనే స్వభావం గల శాస్త్రికి ప్రపంచంలో విరోధు లనేవాళ్లు ఎవరూ లేరు. అతన్ని హింసించిన రజాకార్లకే అతనియందు కోపం లేకపోయింది. వరంగల్లు కాలేజీలో చదువుకున్నాడు. ఇంతలో తండ్రి పోవడంవల్ల జన్మభూమి అయిన జనగామ వచ్చి చేరుకున్నాడు. పతంజలిశాస్త్రికి ఆంధ్రభూమిఅన్నా ఆంధ్రత్వమన్నా ఆకాశమంటే అభిమానం. చదువుకున్నన్నాళ్లూ ఆంధ్రదేశంమీద పాటలు రాస్తూ తెలంగాణా రాయలసీమా కోస్తాజిల్లాలూ సిరికంచా చాందా బస్తరు అన్నీ కలసి అఖండాంధ్రమహారాష్ట్రము స్థాపితమై ఆ రాష్ట్రానికి ముఖ్యపట్టణము హైదరాబాదు కావా లని అతని కోరిక.

పతంజలిశాస్త్రి అఖండాంధ్రస్వప్నము అతడు చదువుమాననగానే ఒక మహాకెరటము చిన్నివారను తీసుకువెళ్లినట్లు అతన్ని తీసుకువెళ్లి ఆంధ్రమహాసభలో సభ్యుణ్ణి చేసింది. ఇంతట్లో ఆంధ్రమహాసభలో నే చీలికలు వచ్చాయి. అసలాంధ్రమహాసభ కమ్యూనిస్టులపాలైంది.

ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నరసింగరావు, జమలాపురం కేశవరావు, మాడపాటి హనుమంతరావు, మందుముల రామచంద్రరావు మొదలైన నాయకులు కోటిఆంధ్రమహాసభ పెట్టి విజయవంతంగా కొనసాగిస్తున్నారు. పతంజలి గాంధీపూజానిరతుడుకాబట్టి కోటిఆంధ్రమహాసభలో చేరినాడు.

సకలభారతావనికీ పందొమ్మిదివందల నలభైఏడు ఆగస్టు శుభముహూర్తమునందు పవిత్రస్వాతంత్ర్యం ఉదయించింది. కాని హైదరాబాదుకు మాత్రం నిజమైన స్వాతంత్ర్యం లేకపోయింది. పతంజలిహృదయం తల్లడిల్లిపోయింది. భారతమాతగర్భంలో హైదరాబాదుస్వాతంత్ర్యం ఒక వ్రణం అనుకున్నాడు ఆ యువకుడు. తన బాగు తనకు తెలి

యను నైజాంప్రభువుకి. ప్రపంచంలో ప్రభువులు దూషింపబడి ప్రజాభ్యుదయప్రభంజనంలో దిశాంతాలకు కొట్టుకొనిపోతూంటే ఇత్తేహాద్ ముసల్మీన్‌కి ఇంత మూర్ఖత ఏమిటి అనుకున్నాడు పతంజలి.

రాష్ట్రకాంగ్రెసు సత్యాగ్రహం ప్రారంభమైంది. తన కుటుంబపు దైన్యస్థితి, తన నిస్సహాయతా ఆలోచించకుండా ఆ శాంతిరణంలోనికి వీరుడై ముందుకు ఉరికాడు. మరుపటి క్షణంలో పోలీసుల లాఠీప్రయోగానికి గురియై గుల్బర్గా జైలులో ప్రవాసి అయిపోయినాడు.

౨

వడగళ్లవాన పెనుభూతంలా వచ్చిపడింది. వడగళ్లకు దయాంతఃకరణలు లేవు. దేశంలో ఆహారపదార్థాలు తక్కువగా వున్నాయని ఆ వడగళ్లవాన ఆలోచించదు. అసలే హిమగర్భమూర్తి వడగళ్లవాన; కర్కశరూపి. అశనిపాతం ఒక చిన్నప్రదేశంమాత్రమే నాశనంచేస్తుంది. వడగళ్ల పాతం పంటలకు కోటి అశనిపాతాలు! పతంజలి ఏడుపు రంగరించిన నవ్వు నవ్వుకున్నాడు.

దేశానికి భారతీయసైన్యదళాలు విముక్తి సమార్జించి స్వేచ్ఛను నెలకొల్పినా, రజాకారుల దురంతాలు అణగిపోయినా, కాంగ్రెసులోనే వడగళ్లవాన కురిసింది. రెండు కాంగ్రెసుపక్షాలయ్యాయి. ఒకదానికి రామానందతీర్థ అధ్యక్షుడు. రెండవదానికి దేశాయిగారధ్యక్షుడు. దేశాయిగారివెనకాల పెట్టనికోటలా రామకృష్ణారావుగారు. నెహ్రూగారు వచ్చివెళ్లినా రెండు పార్టీలలో రాజీ కుదరలేదు. పతంజలి రామకృష్ణారావుగారిని కాకతీయకటకసన్నాహా, తెలంగాణాదక్షిణభుజదండా అని పొగడుకొన్నాడు. అతడు రామకృష్ణారావుగారి పక్షంతరఫున వేలకు వేలు కాంగ్రెసుసభ్యులను చేర్పించాడు. ఇంతట్లో పటేలుగారి రాక మంత్రప్రయోగమై, రెండు పార్టీలూ కలుసుకున్నారు. అచిరకే వడగళ్లవాన కురవటమూ, పంటలు పాడవడమూ అయిపోయింది. తన ఇంట్లో జొన్నకూడే! తెలంగాణా తెల్లజొన్నలు పిండివిసురుకొని రొట్టె కాల్చుకుని తింటారు.

వడగళ్లు రాళ్ళుగా మిగిలిన కొద్దిపంటా ఈనాటికి అయిపోయింది. ఏలాగో హైదరాబాదు స్కూల్ ఫైనల్ పరీక్ష రెండవతరగతిలో కృతార్థుడయ్యాడు. వరంగలులో ఇంటరు చదువుతూండగా తండ్రి పోవడం, స్వగ్రామమైన జనగామ చేరుకోవటం తటస్థించింది.

తన చెల్లీ, తల్లీ, తమ్ముళ్ల దుఃఖాలను ఉపశమింపచేస్తూ తాను తన విషాదాన్ని శివునిలా దాచుకొంటూ గరళకంఠు డయ్యాడు.

“తమ్ముడూ, నువ్వు చదువు మానకు! ఇరవైమూడేళ్లు దాటిన నాబోటి అన్న ఉండి నీకు చదువు మాన్పించటమా?” అన్నాడు.

తల్లి—నాయనా, ఈసంసారం ఎల్లా ఈదను! ఈదినంతో ఇంట్లో జొన్నలూ, జొన్నపిండీకూడా అయిపోయాయి.

చెల్లి మాలక్ష్మి—అన్నయ్యా! నేనూ చదువు మానేస్తాను. నన్ను బట్టికూడా ఇంకా మనకు కొంత ఖర్చు. మనం భరించగలమా?

తమ్ముడు లక్ష్మీనరసింహశాస్త్రి—అన్నా, నేనూ చదువు మానేస్తాను. డాక్టరుగారిదగ్గర కాంపౌండరుగా వుంటే పదిరూపాయలు ఇస్తామంటున్నారు.

పతంజలి—తమ్ముడూ, చెల్లీ! మీ ఇద్దరూ చదువు మానకండి. నారుపోసిన భగవంతుడు నీరుపోయక మానడు. మన వూళ్లో పెద్దరెడ్డి ఓ ఎకరం మెరకపొలం పుచ్చుకుంటానన్నాడు. అది నూతిక్రింద పల్లపుపొలానికి దగ్గరగా వుండడంచేత మన పొలంకూడా పల్లం చేసుకుని అదికూడా నూతి క్రింద వ్యవసాయానికి తీసుకువస్తాడుట. తక్కిన నాలుగెకరాలూ అతనికే కవులుకు ఇస్తున్నాను. పొలంఖరీదు ఇచ్చే మూడువందలూ, కవులుకోసం ముందరే ఇచ్చే వందరూపాయలూ పట్టుకుని అందరం హైదరాబాదు పోదాం. సుల్తాన్ బజారులో ఓ కాంగ్రెసువాడి తన కొట్టులో ఒక చిన్నభాగం వీథిఅరుగుమీద ఆరునెల్లపాటు అద్దె లేకుండా ఇస్తానన్నాడు. తమలపాకుల బీడాలూ, సిగరెట్లూ, బీడీలూ—అలాంటి వస్తువు లేవో

పెట్టి వర్తకం సాగిస్తాను. మన భుక్తి, చదువులు అవిచ్ఛిన్నంగా సాగిపోతాయనే ఆశిస్తున్నాము.

## 3

సుల్తాన్‌బజారులో పతంజలిశాస్త్రి పాన్‌బీడా షాపు పెట్టినాడు. కాంగ్రెసువాడవడమూ, ఉత్తముడూ, చాలా కష్టపడినవాడూ అని పేరుఉండడమూ వల్ల అనేకమంది అతని దుకాణంలోనే తమలపాకు బీడాలు, సిగరెట్లు, బీడీలు, చుట్టలు మొదలైనవి కొనసాగించారు. తమ్మునికీ, చెల్లెలుకూ పాఠశాలలలో ప్రవేశం దొరికింది. తమ్ముణ్ణి ఆంధ్ర స్కూలులోనూ, చెల్లెలిని ఆంధ్రబాలికా పాఠశాలలోనూ చేర్పుకొన్నారు.

ప్రతివాని జీవితంలోనూ ఎన్ని వడగళ్ల వానలు వస్తాయో అని పతంజలి నిట్టూర్పు విడిచినాడు. ఇతి కర్తవ్యతామూఢత్వం లేకుండా, ఏతక్కువకార్యమైతే నేమి, గౌరవప్రదంగా జీవించడం ముఖ్యంకదా! శక్తి లేనివానికి ఉదరపోషణనిమిత్తం ఉద్యోగాపేక్ష! రాష్ట్రపరిపాలన కాంగ్రెసువారిచేతికి వస్తే తానేమన్నా మంత్రిత్వం చేస్తాడా? దేశపాలన ఎవరు ధర్మంగా నడిపిస్తారో వారు రాజకీయనావకు చుక్కాని పట్ట అర్హులు అవుతారు. కాని, కాంగ్రెసువారికి వారిలో వారికి పోటీలు పడి అనేకముఠాలు సిద్ధమై కాంగ్రెసుఆశయాలు మూలపడి, కాంగ్రెసుసంస్థబలం నానాటికీ విచ్ఛిన్నం అయిపోతున్నది. మదరాసు మొదలయిన అన్ని రాష్ట్రాలలోనూ ఈలా కాంగ్రెసు బలం అడుగంటిపోతున్నది.

ఎన్ని చీలికలు, ఎన్ని కక్షలు!

దేశం అంతా గాంధీజీబోధ మరచిపోయినదా?

పూర్ణపురుషుడు, అవతారమూర్తి, అనాసక్తి యోగరూపుడు మహాత్ముడు ప్రజల హృదయాలలో నుండి మాయమయ్యాడా?

"ఏమహాకాంతి నీవుగా మూర్తించినదో?
ఏదివ్యశక్తి నీవుగా రూపం తాల్చినదో?
ఏపవిత్రత కూడుకొని నీ వవతరించావో?
ఓ సత్యపురుషా! అవ్యయరూపాత్మా!

సర్వవేదమంత్రాలు నీస్వరములో నినదించినవి.

ఉపనిషత్ స్వరాలే నీబోధనలలో ప్రకాశించినవి!

పార్థసారథిగీతాదివ్యోపదేశామృతం ఝరులుగా నీవాక్యాల ప్రవహించినవి!

మహాత్మా! ఏకైకావతారా! మాతండ్రీ!

జాతిపితా!

మా జీవితం అంతా నీవు ప్రసరించిఉండలేదా?

ప్రళయాగ్నిమధ్య నీవు హిమాచలశిఖర శీతలత్వానివి!

భయంకర ఝంఝామారుతం మధ్య నీవు సునిశ్చలశాంతివి; నాశనంమధ్య సృష్టివి.

ఆపత్తు మధ్య సత్యానివి.

ఘోరతమస్సులు మాయంచేసే పరమపవిత్ర కాంతివి!

మహాత్మా! మా బాపూ! జాతిపితా! లోకగురూ!"

ఈలా అతని ఆలోచనలు సుళ్లు చుట్టుకుపోతున్నవి. హైదరాబాదుపై రాజకీయపు వడగళ్లవాన కురవనిపూర్వమే పంజాబులో, సింధులో నాశనదేవత బీభత్సతాండవం సలిపినది. నేడు హైదరాబాదుకు శాంతి రాగానే, పంజాబునుంచి, సింధునుంచి కాందిశీకులై వచ్చినవారు కొంతమంది హైదరాబాదులో నివసించడానికై భారతీయప్రభుత్వం ఏర్పాటు చేసింది.

సింధునించి వచ్చినవారు కోటీశ్వరులవడంచేత వారు పెద్దపెద్ద మేడలు కొనుక్కొని పెద్దపెద్ద వర్తకాలు ప్రారంభించినారు. కాని పంజాబునుంచి వచ్చిన కాందిశీకులు పతంజలిశాస్త్రి స్థితిలోనే ఉన్నారు.

## ౪

పతంజలిశాస్త్రి అడిగమెట్టుకు దిగువ బొగ్గులకుంటలో చిన్న పటకుటీరం నిర్మించుకొని కాపురం సాగించినాడు. బొగ్గులకుంటకు ప్రక్కనే మిరిట

ప్రభుత్వం ఒక చిన్న శిబిరం ఏర్పాటుచేసి పంజాబు కాందిశీకులు నివసించడానికి ఏర్పాటుచేసినది. వారందరికీ భారతప్రభుత్వమే అనేకవిధాల సహాయం చేస్తున్నది. అలా వచ్చిన పంజాబీకుటుంబాలలో ఒక బ్రాహ్మణకుటుంబం ఉన్నది. పండిట్ కృష్ణకుమార గాయత్రీ అసలు అయోధ్యబ్రాహ్మణవంశంవాడు. అతని పూర్వు లెపుడో అయోధ్యరాజవంశాలవారు పంజాబు వీరోద్యోగాలకు పోయినప్పుడు, వారు తమకు పురోహితులుగా గాయత్రీవంశంవారిని తీసుకొనిపోయినారు. ఆ వంశంవారు రానురాను అనేక కుటుంబాలుగా వృద్ధిపొందినారు. అచుట్టుప్రక్కల హిందూరాజకుటుంబాలకూ, హిందూవర్తకకుటుంబాలకూ వీరు పురోహితులయ్యారు.

భారతదేశానికి ౧౯౪౭ ఆగస్టులో సంపూర్ణ స్వరాజ్యం రాగానే జరిగిన పంజాబుహత్యలలో పండిట్ కృష్ణకుమారగాయత్రీ తన ఆస్తిపాస్తులన్నీ నాశనం అయిపోయినప్పుడు, తనవారిలో చాలామంది హతమైనప్పుడు, ఏలా పారిపోయి వచ్చాడో వచ్చాడు కూతురుతోనూ, చిన్నకుఱ్ఱవాడితోనూ. భార్య దుర్మరణంపాలయింది. ఆ ఇద్దరే తనకు ఏడుగడ, తన సర్వస్వమూ అనుకుని గాయత్రీపండితుడు ప్రవాహంగా వరదలు కట్టే కంటినీరు ఆపుకుని ప్రభుత్వంవారికి ఇద్దరు బిడ్డలతోనూ అప్పగించుకొన్నాడు. చాలాకాలం ఆ ఇద్దరితో ప్రభుత్వంవారు ఏర్పరచిన కాందిశీకశిబిరాలలో ఉన్నాడు. ఆ మహాప్రళయంవెనుక గాయత్రీపండితుని పౌరోహిత్యం ఎవరికి కావాలి? ఒకభయంకరబృంద దుఃఖం కాందిశీకశిబిరాలన్నీ నిండి మహాసముద్రమై ఉన్నది. ఆ ప్రదేశాలు చూడలేక తోటివారి దుఃఖం భరించలేక గాయత్రిశాస్త్రి దక్షిణంలో ఏడుగడ ఏదైనా దొరకదా అని హైదరాబాదు వచ్చాడు.

హైదరాబాదులోనూ ఎక్కడ చూచినా కాందిశీకులే! ఒకప్రక్క భారతప్రభుత్వంవారు తెచ్చి ఉంచిన పంజాబు కాందిశీకులు. వేరొకప్రక్క హైదరాబాదులాయకాలీ ప్రభుత్వం తెచ్చిపెట్టిన ముస్లింకాందిశీకులు. ఆ సమయంలోనే గాయత్రిశాస్త్రికి ౧౯౫౦ నవంబరు నెలలో పతంజలిశాస్త్రిస్నేహం లభ్యమైంది. ఆ శిబిరంకడ చక్కని పటకుటీరం నిర్మించుకొని బొగ్గులకుంటలో కాపురం చేస్తున్నాడు. సైకిలుమీద బజారుకు పోయి తన తమలపాకుబీడా - సిగరెట్టు - బీడీ దుకాణానికి వెడుతూఉంటాడు. తమ్ముణ్ణెక్కించుకుని వచ్చి ఆంధ్రపాఠశాలలో వదులుతాడు. చెల్లెలు బొగ్గులకుంటనుంచి అన్నగారితో రోడ్డువరకూ నడిచి వచ్చి అక్కడే కాపురంచేస్తున్న బోయివాగన్న రిక్షా సిద్ధంగా ఉంటే అది ఎక్కి నారాయణగుడాలో ఆంధ్ర బాలికాపాఠశాలకు పోతుంది.

పతంజలిశాస్త్రికి ధర్మశాస్త్రాలుకాని, చివరకు విఘ్నేశ్వరపూజైనా చేయించడముగాని ఏమీ రాదు. వచ్చిన దేదో ఆకాస్త ఉరుదూభూయిష్ఠమైన చదువు. ఉర్దూలో మాత్రం ఆరితేరిన పండితుడు. తెలుగు అంతంతమాత్రం. హైదరాబాదు వచ్చినదగ్గిరనుండీ పట్టుదలతో తెలుగు నేర్చుకుంటున్నాడు. అందుకు అతనికి దోహదమూ, ఉత్సాహమూ ఇచ్చినది ప్రక్కనే ఇల్లు కట్టుకుని కాపురం చేస్తున్న వెంకటాచారి.

వెంకటాచారి రసజ్ఞుడు; ప్రభుత్వఉద్యోగంలో ఉన్నాడు. భారతీయసంస్కృతీ, ముఖ్యంగా ఆంధ్రసంస్కృతీ అంటే ప్రాణం అర్పిస్తాడు. కళలంటే ఆత్మ అర్పిస్తాడు. ఒక్కొక్క శిల్పమూ, చిత్రలేఖనమూ చూచి, ఆనందంతో మైమరచిపోతూ ఉంటాడు. అతనికి ప్రాచీన నాణేలు సమకూర్చడం, వానినిగూర్చి పూర్తిగా పరిశోధించి తెలుసుకొనడం జీవితానందకర్మ! పాతబజార్లు, జామాడార్ బజారు వ్రతంలా అంటకొని ఉంటాడు. ఒక్కొక్క ప్రాచీన నాణెం దొరికిందంటే ఇక ఆరోజునుండీ నెలల తరబడి అతనికి పండగే! ఆనాణెం స్నేహితులకు చూపిస్తూ ఇత్తిఆనందంలో మునిగిపోతూఉంటాడు.

ఆ వెంకటాచార్యులతో పరిచయం ప్రథమంలోనే సంభవించింది పతంజలిశాస్త్రికి. అసలు అతని బొగ్గులకుంటకాపురానికి కారకుడు వెంకటాచార్యులు. హైదరాబాదు కాపురానికి రావడానికి ముందు పతంజలిశాస్త్రి మంచి అడ్డా చూచుకోడానికి ఆ నగరం

వచ్చినప్పుడు అనుకోకుండా ఒక కాఫీహోటలులో పతంజలిశాస్త్రి, వెంకటాచారి కలుసుకున్నారు. ఎందుకు వారిద్దరకూ మాటలు కలిసినవో మరి, పదినిముషా లలో స్నేహితులయ్యారు. అరగంటలో ప్రాణమిత్రు లయ్యారు. బొగ్గులకుంటలో గజం మూడురూపాయల చొప్పున స్థలాలు ఉన్నాయనీ, రెండువందల గజాలు పుచ్చుకొని, వెంటనే ఒకపాక నిర్మించుకొని అందులో ప్రవేశించమనీ వెంకటాచార్యులు సలహా ఇచ్చాడు.

వెంకటాచార్యులు తన దొడ్లో రకరకాల మొక్కలు వేసుకుంటాడు. వేసవికాలాలలో తానే నీళ్లు తోడుకొని, మొక్కలకు పోసుకుంటాడు. భూమిబలము మంచి దవడంవల్ల మొక్కలు ఏపుగా వచ్చి అన్నికూరలూ పుష్కలంగా కాస్తవి. ఆత డీ కూరలవ్యవసాయం ప్రారంభించినకడనుండీ బజారునుండి ఒక్క కూరగాని, పచ్చిమిరపకాయగాని కొనలేదు.

పతంజలిశాస్త్రి యీ నూత్నమిత్రుని సూచన వెంటనే అమలులో పెట్టినాడు. రెండువందల గజాలు స్థలం కొని పాక నిర్మించుకొన్నాడు. అప్రక్క ఒక కొద్ది కాలంకు పుచ్చుకొని కూరలు వేయడం సాగించాడు. ఆతని దుకాణమూ వృద్ధిఅవుతున్నది; కూరల పంటా వృద్ధిఅయినది. కాలీ, కాబేజీపువ్వులు, వంకాయలు, బీర, పొట్లకాయలు, టొమాటోలు—పాలకూర మొదలయిన కూరలు, పచ్చిమిర్చి, అన్నీ తన కొట్లో ఓప్రక్కగా పెట్టి వాని అమ్మకమూ సాగించాడు.

౫

౧౯౪౮ నవంబరు నెలలో గాయత్రీపండితుడు బజారుకు వచ్చి పతంజలిశాస్త్రికొట్లో ఒక బీడీలకట్ట కొనుక్కుంటూ "మీరు మా శిబిరంపక్కనే కాపురం చేస్తున్నారు కాదా ?"అని ప్రశ్నించాడు.

"అవును. మిమ్మల్ని చూస్తున్నాను. మీరు ఏదైనా పని చూసుకున్నారా ?"

పతంజలి ఉర్దూలో పండితుడు. ఆతని భాష వింటూ గాయత్రీపండితు డాశ్చర్యం పొంది— "మీరు ఉత్తరాదివారా ?"అని ప్రశ్నించాడు.

"కాదండి. మేము అచ్చమైన ఆంధ్రులం. అయినా ఈ సంస్థానం తురక సంస్థానం అవడంవల్ల రాజభాష ఉర్దూ అయింది మీకు అంగరీజావలె! కాబట్టి అన్నిభాషలూ మేము నేర్చుకోవాలె. ఆంధ్ర భాషమాత్రం మాకు దూరం! మేము ఉర్దూపత్రికలే చదువుతాము. నలుగురు కలుసుకుంటే తెలుగులో మాట్లాడుకోము. ఉర్దూ మాకు ఉగ్గుపాలలా వస్తుంది. మాట్లాడే తెలుగులోనూ ముప్పాతికమాటలు ఉరుదూ మాటలే !"

"చాలా చిత్రమే ! నా కేమీ పని దొరకలేదు బాబూజీ ! ఎంతకాలమని ఈలా ప్రభుత్వసహాయం పొందుతూ ఉండను ! పంజాబులో రాజ్యం ఏలినాను. ఈరోజు ఇక్కడ శానిస్రబతుకుకన్న అధ్వాన్నంగా ఉంది."

పతంజలిశాస్త్రి పండిట్జీవిషాదముఖం చూచి నాడు. ఆతని హృదయం ద్రవించిపోయింది. కొంచెం గొంతుక సవరించుకొని, ఆతడు గాయత్రీపండితుని చూచి—

"పండిట్జీ ! మీరు నాకో భాగస్వాములు కండి. ఈ కొట్టు నేను ఒక్కణ్ణీ చూసుకోలేకుండా ఉన్నాను!" అని గాఢకంఠంతో ప్రార్థనగా అడిగి నాడు.

"మీతమ్ముడికి ఒక అబ్బాయి ఉన్నట్టు న్నాడు!"

"ఉన్నాడు. వాడికి చదువు బాగా వస్తోంది. వాడికి ఎంత చదువైనా చెప్పించదలచుకొన్నాను."

"మాఅమ్మాయి లాహోరులో బాలికాపాఠ శాలలో అయిదవ ఫారం చదువుకుంటూ ఉండేది."

"మీకు సంతానం ఎందరు ?"

గాయత్రీపండిట్జీకి కంట నీరు తిరిగింది. తల వంచుకొన్నాడు.

"మా అమ్మాయి, అయిదేండ్ల చిన్నకుఱ్ఱవాడూ నండి. మాపెద్దబ్బాయిని మీ యాదువాణ్ణి మాకళ్ల ఎదుటే నాడిచేశారు. వాడు బ్రతికే ఉన్నాడో

ప్రాణమే వదిలాడో! మేము ప్రాణాలకు వాణ్ణి అలా వదిలి పారిపోయాము. ఆదృశ్యం చూసి, గుండె ఆగి నా భార్య గతించినది. నాకమ్మడికుటుంబం సగం నాశనమైంది. తక్కినవాళ్లందరూ 'ఢిల్లీ' ప్రక్క శిబిరాలలో ఉంటున్నారు."

"పండిట్జీ, మీరు వెంటనే శిబిరం వదలి నేను కౌలు పుచ్చుకున్న దొడ్డిలో కాపురం పెట్టండి. నాలుగు వందల గజాల స్థలం. ఆ స్థలం మీ పేర కొందాం. నేను ఎక్కడో అప్పు పట్టుకువస్తాను. మీరు నెమ్మదిగా ఆ అప్పు తీర్చుకోవచ్చును."

"నాయనా! మీకు నేను మెడను కట్టిన రాయిలా తయారవుతాను."

"అలా మీరేమీ అనుకోకండి! నేను ఏవో సబ్బులూ, తలనూనెలూ, ఇంకా ఇతరసామానులూ అమ్మడం ప్రారంభించాను. అవి బాగా అమ్ముతున్నాయి. అదీకాక ఈమధ్య ఆంధ్రపత్రిక, భారతి, బ్లిట్జిపత్రికల అమ్మకం సాగించాను. ఇవన్నీ ఒక్కణ్ణే చూసుకోలేకుండా ఉన్నాను పండిట్జీ!"

"ఇంత చిన్న కొట్టువ్యాపారానికి మనం ఇద్దరం ఏలా ఇముడుతాము శాస్త్రీజీ?"

"ఈ ప్రక్క ఓ పెద్దకొట్టు అద్దెకు వచ్చింది. దానికి బజానా ఇచ్చాను. అక్కడ సాగిద్దాము. ఈ కొట్టు ఇచ్చిన స్నేహితునకు ఇబ్బంది అవుతున్నది. అందుకనే ఆపని చేశాను."

"సరే, కానివ్వండి. తక్కిన మాటలు ఇంటి దగ్గిర మాట్లాడుకుందాము."

ఒకనెలలో గాయత్రీశాస్త్రికోసం పటకుటీరం తయారైనది. ప్రభుత్వసహాయంతోనూ, పతంజలి తెచ్చిన అప్పుతోనూ ఆ నాలుగువందలగజాల భూమి కృష్ణకుమారగాయత్రీపండితుడు కొనుక్కున్నాడు. పతంజలి, గాయత్రీపండితులిద్దరూ కలిసి వ్యవసాయమూ, కొట్టూ రెండూ చూసుకోవడం సాగించారు.

గాయత్రీపండితుని కొమరిత జయనందిని అందాలపుంజము. కోల మోము, తీర్చిదిద్దిన కనులు, ముక్కు, నోరు తీరు. పసిమిబంగారులో పాటలవర్ణము సమ్మిశ్రితమైనఛాయ. పదునేడేండ్ల మిసిమిమీరిపుత్తడి బొమ్మ. లేసెలు జీరలుకట్టి జిడ్డుఆవుపాలమీగడ తరగలు కట్టినట్టి చిక్కని మధురకంఠధ్వనితో ఉర్దూపంజాబీలు మాట్లాడుతూఉంటే పతంజలిహృదయం జల్లుమనేది. ఈ మధురపుష్పంకోసం పంజాబీకాందిశీకులలో యువకులు ప్రథమంలో అస్తమానమూ వస్తూ ఉండేవారే గాని గాయత్రీపండిట్జీకి ఆ వేమీ గిట్టక వచ్చినవారిని తన తోటయింటిబయట రోడ్డుమీదనే నిలబెట్టి మాట్లాడేవాడు. తాను లేనప్పుడు కొమరిత పతంజలిఇంట్లో ఉండేటట్లు కట్టుదిట్టం చేసినాడు. ఆ కారణాలవల్ల పంజాబీయువకులు నిట్టూర్పులు విడిచి లాభం లేదనే నిస్పృహవల్ల గాయత్రీపండితుని ఇంటికి రావడం నెమ్మది నెమ్మదిగా మానివేసినారు.

జయనందినికీ, పతంజలిచెల్లెలు మాలక్ష్మికీ నానాటికీ స్నేహం గాఢం అయిపోయింది. మాలక్ష్మి జయనందినికి తెలుగు నేర్ప సాగించింది. జయనందిని లాగు, చొక్కా, వల్లె మాని, మాలక్ష్మిపరిష్కర్తృత్వంలో తెలుగుబాలికల రీతిని చీరా జంపరూ ధరించడం నేర్చుకున్నది. గాయత్రీపండితుని కొడుకు రాధాకుమార్ అయిదేండ్లబాలుడు తెలుగుదేశం బాలకుడే అయినట్లు మాలక్ష్మిదగ్గిర తెలుగు మాట్లాడడం నేర్చుకున్నాడు. ఒక్కనిమిషంకూడా మాలక్ష్మినీ, పతంజలితల్లి సుందరమ్మగారినీ వదిలేవాడు కాడు. సుందరమ్మగారికి రాధాకుమారుని పెంపకము పరమసంతోషం కలుగజేసే వ్రతం అయినది. ఆ బాలుడు ఈమే తనతల్లిగా "అత్తా"అంటూ ఆవిడపక్కలోనే పండుకొనడం సాగించాడు.

జయనందిని ఆలోచనాపరురాలు. భయంకరమైన హృదయవిదారణదృశ్యాలెన్నో పంజాబులో చూచింది. ఆమె పులుల గుంపులను చూచిన కురంగిలా వణికిపోయింది. ఎన్ని దినాలో ఆమెకు పీడకలలు వస్తూ ఉండేవి. పంజాబువిశ్వవిద్యాలయప్రవేశకపరీక్షకు చదువుకూఉండగా ఆ దేశం ముక్కలయింది.

ఈనాడు ఈ పతంజలిశాస్త్రి ఆ బాలికకు సెహ్రా అవతారంలా కనుపించినాడు. ఆ బాలికకు

పతంజలిని చూచినప్పుడల్లా ఏదో కాంతి, ఏదో ధైర్యము, ఏదో వర్ణింపలేని ఆశా కలుగుతూ ఉండేవి.

పంజాబూ, హైదరాబాదురాష్ట్రం ఏదో కొద్ది భేదాలుగా ఉంది. కాని పంజాబులో తాను కోరిన ఏదో విచిత్రసౌందర్యంతో తెలుగువారిలో దృశ్యమైనది. తల్లి చీరె కట్టుకొనేది. కాని ఆ విధానం అమోఘ విధానం. తెలుగువారి కట్టూ, బొట్టూ ఏదో కాంతి పూరితంగా ఉన్నవి. వీరి ఔచిత్యము లోతులనుంచీ ప్రవహించి జీవితం అంతా ప్రసరిస్తుంది. తెలుగు వారిలో హుందాతనం భారతజాతికి వన్నెగా కనబడింది. జీవితం సౌందర్యవంతం చేసుకోవడం తెలుగు వారికే తెలుసును. ఆలా సౌందర్యమయపురుషజీవితానికి చిహ్నితంగా పతంజలిశాస్త్రి కనబడినాడు.

౬

పతంజలిశాస్త్రి రాత్రిళ్లు చెల్లెలికీ, జయనందినికీ పాఠాలు చెప్పేవాడు. అతడు పాఠాలు చెప్పుతూ ఉంటే శాస్త్రిమోము పూర్ణిమాజ్యోత్స్నలా వెలిగిపోయేది. అతనిమాటలలో ఉత్కంఠతా, అతడు చెప్పే ఉత్సాహమూ జయనందిని చూచేది. జీలంనదీతీరంనుంచి వచ్చిన ఆ ఔత్తరాహయవ్వనహృదయానికి ఈ ముచికుందనదీతీరవాసుడైన పతంజలి బాలికలను కష్టాలనుండి రక్షించే వీరుడై కన్పడినాడు. నరకాసురుని సంహరించి పదునారువేల రాజకుమారికలను రక్షించిన శ్రీకృష్ణు డీలాంటివాడేనా యని జయనందిని అనుకున్నది. జయనందిని గోధుమతో వండే పిండివంటలు మాలక్ష్మి నేర్చుకొనేది. తమదేశపు పిండివంటలు జయనందినికి నేర్పేది. వీరిరువురకూ చదువులు నేర్పే పతంజలిశాస్త్రి వీరిద్దరి ప్రాణస్నేహమూ చూచి పులకరించిపోయేవాడు.

గాయత్రీపండితుడు నెమ్మదిగా తన కష్టాలు మరిచిపోయినాడు. తన ఏభైరెండుసంవత్సరాల జీవితమూ దక్షిణాన కృష్ణాగోదావరీమధ్య దేశంలోనే గడచినట్లయినది. వర్తకమునందూ, ఇంటిదొడ్డి కాయకూరల పెంపకమునందూ అతనికి విచిత్రమైన అనురాగం కలిగినది. అరటికాయకూర, దోసకాయపచ్చడి, ఆనపకాయ, గోంగూరపులుసు మొదలైన తెనుగువంటకాలు అతని జిహ్వకు నూత్నరుచులు కొనితెచ్చి, అతని కలలలో కనుపించే పంజాబుహాళ్యదృశ్యాల్ని మాయం చేసినవి.

పతంజలీ, గాయత్రీపండితుడూ కలిసి కాంగ్రెసూ, బాపూజీబోసులూ, ముందు దేశంలో జరుగబోయే మార్పులూ చర్చించుకొనేవారు. వేదాంతవిషయాలు మాట్లాడుకొనేవారు. వీరితో వెంకటాచార్యులు చేరుతూ ఉండేవాడు. వీరిముగ్గురి సంభాషణా జయనందినీ, మాలక్ష్మి చెవులార వింటూ ఆనందం పొందేవారు.

వెంకటాచారి—పండిట్జీ, ఏదోరూపంగా మనుష్యుని మనస్సు ఆనందం కోరుతూ ఉంటుంది. రాజకీయాలలో, ఇతరులకు ఉపకారాలు చేయడమో, ధనం సేకరించడమో, అధికారంలో ఇతరులను పాలించడమో ఈలా మానవుని మనస్సునకు సంతతవ్యాపారమత్తత ఉంటూనే ఉండాలి!

పండిట్జీ—అయితే, మనుష్యుని ఆత్మకు ఆనందం కలిగే విషయాలను మనుష్యుడు వాంఛించడా?

పతంజలి—ఆత్మ వ్యక్తం కాని వస్తువు. మనస్సు వ్యక్తం అయిన మానవజీవితంలోని ముఖ్యవస్తువు.

పండిట్జీ—మనస్సు అతి సున్నితమై పోనుపోను మనస్సు తత్వాన్ని మించిపొందే వ్యవస్థే ఆత్మవ్యవస్థ. ఆ వ్యవస్థనూ మించిన వ్యవస్థ సర్వాంతర్యామిస్థితి అయిన ఒక మహోత్కృష్టమైన అనిర్వచనీయావస్థ పరమాత్మావస్థ. భౌతిక విషయజ్ఞానమైన స్థితిలో ప్రాథమికమైన మనస్సు స్థితి.

వెంకటాచారి—కాబట్టే మహాత్ముడు ఈ మనస్సు ధర్మపరమైన కార్యాలలో నిమగ్నంచేయమన్నాడు. లోకోపకారమూ, స్వకీయానందమూ రెండూ మిశ్రమై మనుష్యుని జీవితం ఒక ఉత్తమనదీ ప్రవాహంలా ప్రవహించిపోతుంది.

ఈ సంభాషణలు జయనందినికి అస్పష్టమైనట్లుండి అర్థం కానట్లయ్యేవి. పతంజలిమాట, పతంజలికంఠము,

పతంజలి మోము త్రిప్పటము, అతడు కూర్చొనే విధానము, చేతులు త్రిప్పేరీతులూ హృదయానికి ఏదో తెలియగారాని ఉప్పొంగు నిచ్చేవి.

ఆ బాలికలో కలిగే పరివర్తనం, ఆ వాతావరణం పరీమళంలా కమ్ముకుని పతంజలిజీవితాన్ని స్పర్శించేది. ఆ బాలిక తన్ను చూడడం లేదను కొన్నప్పుడల్లా పతంజలి ఆమెను తనివితీర గమనించేవాడు. ఆమె పంజాబీపాటలు, ఆమె ఆటలు, ఆమె తోటపని చేసే అందమైన తీరులూ చిత్రాలై అతని హృదయఫలకంపైన నవనవలాడేవి. కాని అతని హృదయంలో ఆ బాలికపైన స్త్రీవాంఛ అతనికి దర్శనము కాలేదు. ఆమె ఏదో అజంతాచిత్రలేఖనము; పాలం పేటలో సౌందర్యవిన్యాసవంతమైన శిల్పము.

౮

[illegible] మే నెల వచ్చింది. ఎండలు తీక్ష్ణంగా కాస్తున్నాయి. ఉన్నట్టుండి ఒక ఆదివారంనాడు పతంజలి భోజనానికి ఇంటికి వచ్చిన సమయంలో పదునొకండుగంటలకు ఆకాశం చటుక్కున మేఘాలతో నిండి ప్రపంచం అంతా ఒక్కసారి చల్లబడి వడగళ్ల వాన కురిసింది. పతంజలి స్నానానికని దొడ్డిలోనికి పోతూ బీరచిక్కుడుపాదులు చూస్తున్నాడు. ఆ ఎండలో మేలిముసుగు వేసుకుని, ఏదో కూనిరాగం తీస్తూ, పందిరిఛాయల నిలుచుండి బీన్సుకాయలు కోస్తున్నది జయనందిని—వడగళ్ల వాన కురవబోయే ముందు ఆ చల్లదనానికి కంఠం ఎత్తి.

“మై గిరిధర ఘర్ కే జాఊఁ” అని పాడుకుంటున్న జయనందిని పతంజలిని గమనించలేదు. పతంజలి ఆమెను చూస్తూ ఆనందంతో అలా నిలుచుండిపోయినాడు.

జల్లుమని వడగళ్లు కురియడం ప్రారంభించాయి. జాజిపువ్వులులా, పారిజాతం పువ్వులులా, ఆణిముత్యాలులా చిన్నవై ఆ వడగళ్లు కురిసినవి. అవి దేవతలు కురిపించే పూలవర్షంలా ఉన్నవి.

కాని పతంజలికి వెనుక తాను పొలంలో ఉన్నప్పుడు ఉసిరికాయలంత వడగళ్లు మహావేగంగా అతని తోటిపాళంలా పడిన రోజు మనస్సులో మెరుము మెరిసింది. అతనికి ఈ తోటలూ, ఈ ఇళ్లూ, ఈ ప్రియబంధువులూ నాశనం అయిపోతున్నట్లు దిగ్భ్రమయుక్తమై విపరీతభయం ఆవహించింది. పిడుగు తగిలినవానిలా తూలి “అమ్మయ్యో!” అంటూ కూలిపోయినాడు.

అతడు పడిన చప్పుడు విని చటుక్కున తిరిగి చూచి జయనందిని “ఏమి టది మామా!” అని అతని కడకు పరుగిడివచ్చింది. అతని ప్రక్కనే చటుక్కున చతికిలబడి “ఏమిటి! దెబ్బ తగిలిందా? మాట్లాడు మామా!” అని గజగజ వణుకుతూ పతంజలిని తన ఒళ్లోకి తీసుకుని అతని తల తన హృదయానకు అదుముకున్నది.

అతడూ నిమేషంలో తెప్పిరిలి, ఆమెస్పర్శసుఖం అనుభవిస్తూ మరిరెండునిమేషాలు అలాగే ఉండినాడు. ఇద్దరి హృదయాలలో తెరలు వీగిపోయినాయి. అతని జీవితానికి ఆమె అగస్టు పదిహేనవ తేదీ అయినది, అతడా బాలికజీవితానికి రాబోవు పవిత్రాశయమూర్తియై గోచరించినాడు. తనకు తెలియకుండా పతంజలిబాహువు లామెను గాఢంగా చుట్టివేసినవి.

చుట్టూ, వారిపైనా వడగళ్లు మల్లిమొగ్గలై జలజలా రాలుతున్నవి.

రాధాకుమారుడూ, లక్ష్మీనృసింహశాస్త్రీ, మాలక్ష్మి వడగళ్లు ఏరుకొనడానికి దొడ్లోకి వచ్చినారు. “ఏమిటి అక్కా!” అనీ, “ఏమిటి బహిన్” అని రాధాకుమారుడూ, “ఏం జరిగిన దన్నయ్యా! పడ్డావా? ఏమిటి జయాబహిన్” అని శాస్త్రీ వీ రిరువురిదగ్గిరకు పరుగిడి వచ్చారు. మాలక్ష్మి “అమ్మో! ఏమి జరిగిన దేమిటి?” అని ఒక్క గంతులో వీరిని సమీపించింది. ఇదంతా మూడునిమేషాల కాలంమాత్రం!

వడగళ్లు అక్షతలులా, తలంబ్రాలులా ఇంకను చిన్నవై కురుస్తున్నవి.

చటుక్కున పతంజలి లేచి “తల తిరిగింది, తూలిపోయినాను చెల్లీ! జయ నన్ను పట్టుకోకపోతే, చాలా దెబ్బ తగిలిఉండును!” అంటూ నిలుచుండినాడు.

జయానందిని మోము పలాశపుష్పవర్ణకాంతితో వెలిగినది. సిగ్గుతో ఆమె మోము ఆర్ద్రత తాల్చినది.

జయానందిని లేస్తూ "మామకు కాలు జారింది కాబోలు!" అని నిలుచుండినది.

వడగళ్లవాన వెలిసింది.

* * *

ఆరాత్రి వెంకటాచార్యులు గాయత్రీపండితుని కడకు వివాహ బేరానికి వచ్చినాడు. పండిట్జీ హృదయానందానికి కడపలు లేకపోయినది.

"ఆచార్యభాయ్! నా హృదయంలో ఈ కోర్కె మొదటినుండీ ఉంది. నాయనా! ఇంతకన్న నా జన్మకు సంతోషం ఏముంది!" అనినాడు.

పతంజల్లి తల్లి సుందరమ్మగారు తన జన్మకు ఇంతకన్న మోక్షానందం ఏమున్నది అనుకున్నది. వారిద్దరికీ ఆరాత్రి ఆమె కన్నులనుండి ఆనందబిందువులు రాలుతూవుండగా ఒకచోట కూర్చొపెట్టి దృష్టి తీసింది.

వడగళ్లు, తుఫానులు, దావానలాలు, ప్రళయాలూ మానవజీవితానికి ఏలాంటి మార్పులు తీసుకొని వస్తాయి! హిమాలయతనయఅంశలో ఉద్భవించిన ఈ జయ తన జీవితం వెతుక్కుంటూ ఈలా దక్షిణానికి వచ్చింది. ఆ మనోహరమూర్తికి కర్కశుడైన తాను తగిఉండడు. అయినా తెనుగునాట ఔత్తరాహశక్తి ప్రసరించే దివ్యముహూర్తం ఆసన్నమైనది కాబోలు ననుకొన్నాడు. జయకు తానే దైవమట, తానే చక్రవర్తి అట, తానే నాయకుడట! అని మాలక్ష్మి ఆనందంతో పొంగిపోతూ అన్న చెవిలో గుసగుసలు పలికినది.

జయ తేరి చూడజాలని సౌందర్యంతో నందనవన పారిభద్రపుష్పంలా వికసించిపోయినది.

అవతారమూర్తి తన గురువు! అతని మోము తన హృదయంలో దాచుకొని అదుముకొన్నప్పుడు వర్ణింపలేని అంత ఆనందం తన్ను ముంచి వేసినదేమి!

ఆమెను మాలక్ష్మి "మా అన్నను వివాహమాడగలవా వదినా?" అని అడిగినప్పుడు కలిగిన పులకరింపులతో మాలక్ష్మినే గట్టిగా కౌగలించుకొని, ఆమె చెంపలు గాఢంగా చుంబించింది. ఆమెకన్నులలో మధురత్రపాజ్యోత్స్నలు అలుముకు పోయినవి. "భాభీ! నాకేం తెలుసును? నీకే తెలుసును" అన్నది.

వడగళ్లు అమృతబిందువులై కురిసి వెలిసినవి కదా!

